


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



### నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### సుల్తాన్ గారి జాతకం

**చిన్నప్పుడు** ఇంటి ముందుకి ''చిలకజోస్యం చెప్తాం అండి.. చిలకజోస్యం'' అంటూ డబ్బాలో చిలకనీ, కొన్ని అట్ట ముక్కల్నీ పెట్టుకుని వచ్చేవారు. పిల్లలకే కాదు, పెద్దవాళ్ళకీ సరదా. పిలిచేవాళ్ళం. అసలు ఎర్రని ముక్కుతో వున్న చిలక పచ్చరంగుని అంత దగ్గర నుండి చూడడమే పెద్ద థ్రిల్. అది బహు తర్ఫీదు పొందిన గడసరి అయివుంటుంది. 5రూపాయల బిళ్ళకానీ కాయితం కానీ పెట్టేనే ''సెప్పవే సిలక సెప్పు... అమ్మవారి జ్యోతిస్యం సెప్పు.. జరిగినది సెప్పు... జరుగుతున్నది సెప్పు.. జరగబోయేది సెప్పు'' అంటూ, అట్టముక్కలు, పేకముక్కల్లా వరుసగా కింద పేరవగానే, ముక్కుతో ఓ అట్ట తీస్తుంది. అతను అందులో వున్న సుబ్రమణ్యేశ్వర స్వామినో, క్రిష్ణుడినో చూడగానే, ముక్కు దగ్గర పెట్టుకుని, కళ్ళు మూసుకుని ''మా సెడ్డ జాతకం తల్లి.. కానీ నీమీద ఒకరి ఏడ్పు వుంది. దానికి నువ్వు నాలుగు కిలోల బియ్యం, కొబ్బరి పుడకలు, పసుపు, కుంకుమ, కొత్త పంచె పెడ్తే సిక్కులు విడదీస్తది సిలక'' అంటాడు. లేదా, ప్రతి మూడో కార్డులో ''గవ్వలు పడ్డాయి.. మూడొందలు పెడ్తే కానీ విప్పలేం, సెప్పలేం'' అంటాడు.

చిలుక పెట్టెలో జాం పండు తింటూ తన యజమాని పనితనాన్ని ఎంజాయ్ చేస్తుంటుంది.

మా అమ్మమ్మగారు ''వాడి మాటలకేం గానీ, వాడికే అంత మహత్యం వుంటే ఇలా పెట్టుచ్చుకుని వీధి వీధి వీధి ఎందుకు తిరుగుతాడు? అనేవారు.

ఓసారి ''బొందలగడ్డల సింత సెట్టు కింద కోయదొర మస్తు జాత్కం సెప్తుండు, ఒక అఠాణా ఇమ్మని'' లాగూ వూడిపోతుంటే, పైకి తోసుకుంటూ మా సందానీ పరిగెత్తుకొచ్చాడు. నేనూ కోయదొర అనగానే, ఉత్సాహంతో, అమ్మమ్మకి తెలియకుండా, వత్తుల పెట్టెలోనుండి అర్ధరూపాయి తీసుకొచ్చి వాడికిచ్చాను. అర్ధరూపాయితో జాతకం మారి మహారాజు అయిపోతామంటే ఆశకదా!

''కోయదొరలని పిలవకండి. సంచిలో భస్మాలు, లేపనాలు ఉంటాయి. అవి రాస్తే, వశీకరణం అయి వాళ్ళ వెంట వెళ్ళిపోతారుట'' అని అనసూయా వాళ్ళమ్మ మాతో చాలాసార్లు చెప్పింది. అయినా, ఆ తలకి కట్టిన రిబ్బనూ, ఒంటికి కట్టుకున్న పులి చర్మం, చెవులకి వేళ్ళాడే చంద్రవంకలూ, దట్టంగా కాటుకతో రాసుకున్న కనుబొమ్మలూ, ఎర్రటి రూపాయి

బిళ్ళంత కుంకుమ బొట్టూ, మెడలో తాళ్ళూ, తాయెత్తులూ, జబ్బలకి ,పూసలూ, మొలకి మువ్వలూ, చేతిలో గొడుగూ, బట్టసంచీ ఇవన్నీ చూడ్డానికి ఆసక్తిగా వుండేవి. పైగా సంచిలోంచి ఫోటోలు తీస్తే పి.వి నరసింహారావుగారితోటీ, అమితాబ్ బచ్చన్‌తోటీ వున్న ఫోటోలు దొరవి వాళ్ళే ఈ దొర పక్కన కాసింత వినయంగా ఒంగి వుండేవాళ్ళు. అప్పట్లోనే ట్రిక్ ఫోటో గ్రఫీ వుండేదని తెలీని అమాయకపురోజులు. ఎక్జిబిషన్‌లో మిధున్ చక్రవర్తి పక్కన భుజం మీద చెయ్యి వేసో, ధర్మేంద్ర వెనక స్కూటర్ ఎక్కిన ఫోటోలో తీసుకుని, ఆ అట్ట ధర్మేంద్రని తడిమి చూసి, ఎంతో సాధించిన మొహాలతో ఫోటోలు తీయించుకున్న అల్ప సంతోషపు కాలం అది.

కోయదొర "బుర్ ర్ ర్ ర్.." అని "శాస్త్రం సెప్తామండి శాస్త్రం... వున్నది వున్నట్టుగా, లేనిది లేనట్టుగా.." అని తమాషాగా పలుకుతుంటే ఫ్రీగా ఎన్.టీ.ఆర్ సినిమా చూసేస్తున్నంత సంబరం.

సరే, లాగూ వూడిపోతున్న సందానీగాడూ, వాడి వెనక నేనూ, సగం దూరంలో ఎదురైన వినోలియా .. అందరం బొందలగడ్డ అనబడే ముస్లిమ్ల సమాధుల కేసి పరిగెత్తాం. ఆ తెల్లని 'గోరీ'లూ, మధ్యలో చింత చెట్టూ, నాకైతే చాలా ప్రశాంతంగా అనిపించేది. నా ఫ్రెండ్స్ అంతా "ఆ చెట్టుమీద దెయ్యాలున్నాయి. పెరుమాళ్ళు మొదటి పెళ్ళాం, అక్కడ జుట్టు విరబోసుకుని తిరుగుతూ ఓసారి ఎవరికో కనిపించిందంట" అని చెప్పేవారు. అప్పటికి ఆవిడపోయి ఏడాది అవుతోంది. కుక్కలత్తమ్మ తన దగ్గర అప్పు తీసుకున్న యాభై రూపాయిలూ ఇవ్వకుండానే పోయింది. ఇప్పుడైనా ఇస్తుందేమో అన్నట్లు ఆశగా ఆరా తీసిందికూడా ఓసారి" ఏ టైంలో కనిపించిందీ?" అని. నాకైతే మంగమ్మ చావకుండానే, ఇంత పసుపు రాసుకుని, మొహానికి పెద్ద బొట్టెట్టుకుని, తెల్ల చీరెతో తెగ భయపెట్టేది. వీళ్ళకన్నా దెయ్యాలు తక్కువ భయంకరంగా వుంటాయి అని ఫిక్స్ అయిపోయి, ఆ చింతచెట్టు కిందే, బడి ఎగ్గొట్టి కూర్చుని, సందానీ వాళ్ళకి "జగన్మోహినీ, పేదరాశి పెద్దమ్మ కదా, గులేబాకావళీ కథా, అన్నీ మార్నింగ్ షో లు చూసొచ్చి కథలు చెప్పేదాన్ని. అసలు 'చల్లనిగాలీ, మధ్యలో సందానీగాడు రాయితో కొడ్తే కిందపడే చితకాయలూ, కాలంలో వచ్చే చింతచిగురూ... అన్నీ ఎంత బావుండేవో. అక్కడినుండి కోసుకొచ్చిన చింత చిగురుతో పప్పు వండినదని అమ్మమ్మ, ఎదురింటి వరలక్ష్మమ్మగారు "సమాధుల్లో చింత చిగురు పప్పేవిటండీ?" అంది.

"బతికున్న వాళ్ళకి భయపడాలికానీ, చచ్చిపోయిన వాళ్ళకి భయం ఎందుకమ్మా? పాపం ఏం చేస్తారనీ?" అనేది అమ్మమ్మ.

నేనూ, సందానీ, వినోలియా వెళ్ళేసరికి, చుట్ట పొగ గుప్పు గుప్పుమని వదుల్తున్న కోయదొర, మమ్మల్ని చూసి, "రండి పిల్లలూ ఏం తెచ్చారు?" అన్నాడు.

సందానీ రాజగర్వంతో అర్ధరూపాయి విసిరి, చెయ్యిజాపాడు. కోయదొర చుట్ట కడదాకా పీల్చి, దూరంగా విసిరి "బుర్ ర్ ర్ర్ ర్.." అని అరిచిన అరుపుకి, పిల్ల దెయ్యాలని నిద్రపుచ్చుతున్న, చింతచెట్టు మీద తల్లి దెయ్యాలు తలలూపుతూ, రయ్యిన గాలివీచేట్లు, విసుక్కున్నాయి." నెమ్మదిగా చెప్పలేవూ? ఇంతోటి జ్యోతీష్యం?" అని

"నీది అసువంటీ ఇసువంటీ సెయ్యికాదు. మహారాజు జాతకం, రెండు సినిమాహాళ్ళు, నాలుగు కాఫీ హోటళ్ళు, మూడు రైసు మిల్లులు, ఐదు సామిల్లులు పెట్టి, కోటీశ్వరుడవు అవుతావు. గాలి మోటర్లు రోజుకొక్కటి మారుస్తావు తండ్రి.. నాలుగు మిద్దెల మేడమీద నిలబడి, కింద పోయేటోళ్ళకి వెండి కాసులు విసిరే జాతకం దొర "అని", అరిచి, భంగు కొట్టిన మత్తుకేమో, అట్లాగే, వెనక్కి ఒరిగి చింత చెట్టుకి ఆనుకుని నిద్రపోయాడు.

వినోలియా "ఇలా పోనీ టైల్ కట్టుకునొచ్చావేంటే ఏ.వీ రమణీ, దెయ్యాలు చివర్లు వదిలేసుకునొస్తే, పట్టుకుని మన వెంట వస్తాయట" అని గబగబా అల్లేసింది.

"నీ బొంద ఇంత మంచిగాలీ, వెలుతురూ వదిలేసి మన ఇరుకిళ్ళకెందుకొస్తాయి? ఏడీ ఈ సందానీ?" అని చూసేసరికి, మనోడు ఒక క్ర్ర దుంగ భుజం మీద గదలా పెట్టుకుని, ఠీవిగా మహరాజు పోజులో కనిపించాడు.

"అల్లపురం రాజుగోరు, ఇల్లుపురం పోరలతో మల్లుపురం పై దండెత్తే ... రాజులో రే రాజులో" అంటూ పాడుస్తూ, సందానీ రాజులా మా ముందు నడుస్తుంటే, మేం మధ్యలో దొరికిన ఈతాకు అతనికి వింజామరలా పట్టుకు వూపుతూ, గలగల వేసవిలో గాలి వూదే సంగీతంతో కలిసి నవ్వుతూ, ఇళ్ళవైపు సాగిపోయాం.

మరునాటి నుండి మా సందానీ, వాళ్ళ నాయనని అద్దె సైకిల్‌కి డబ్బులు అడిగి, ఇవ్వనంటే, "నేను నాలుగు మిద్దెల మేడమీద నిలబడి, నీకు ఇట్టాంటి రూపాయలు, సంచిలల్ల కట్టి విసుర్తాం. ఏం అనుకున్నావో" అనడం మొదలు పెట్టాడు. వాళ్ళమ్మతో "నీకీ బేగం ముషరఫ్ ఆలీ, రెహమానియా, ఫతే మెహరున్నీసాం బైగ్!" అని పిలుస్తాయి ఈడ జనం. మనం నాలుగు మిద్దెల మేడల వుంటాం. నీకీ బులాకీ, చేతికి పదారు బంగారు గాజులు, మెడల జుమ్మా మసీద్ బిళ్ళల చంద్రహారం చేపిస్తా. మన బిజిలీ మేక పిల్లైనా దాన్కీ బీ బంగారు గంట చేపించి మెడల కడ్తాయి" అని చెప్తూ కనిపించాడు.

రంగనాథం సార్ అటెండెన్స్ పిలుస్తుంటే "సందానీ" అని, లేచి "అలా రఖా, హుస్సేన్ సందానీ సుల్తాన్ సాబ్! ఇయ్యాళ సందీ నాపేరు" అన్నాడు.

"అదేంట్రా? రిజిస్టర్‌లో అలా లేదుగా?" అంటే "మా తాతదీ, పెద్ద తాతదీ బీ కల్పినయ్ సార్.. నేను సుల్తాన్ లెక్క నాలుగు మిద్దెల మేడల నిలబడి కాసులు విసుర్తుంటే, కింద నిలబడి ఈ దాసుగాడూ, సురేష్‌గాడూ, సత్తెన్నారాయణగాడూ.. ఈ పేరుతోనే జైజై అంటరు సార్. ఇప్పుడు నా తాన లేదు. వాళ్ళ తాన బాల్ పాయింట్ పెన్ వుందని, పోజులు కొడ్తున్నారు గాని. నేను మస్తు డబ్బులు కమాయిస్తా.. రెండు సెన్మ హాళ్ళు, మూడు కాఫీ హోటళ్ళు, నాలుగు రైసు మిల్లులు, ఐదు సామిల్లులు.." అని చెప్తుంటే, నేను వినోలియా, వాడు మరిచిపోయినవి అందిస్తూ, గుసగుసగా చెవిలో వూదాం.

"ఎవరు చెప్పారురా?" రంగనాథం సార్ నవ్వుతూ అడిగాడు.

"కోయ దొర సార్" అన్నాడు ధీమాగా.

రంగనాథం సార్" అయితే తప్పకుండా అవుతుంది. అంబ పలికితేనే కొండ దొరపలుకుతాడు.. వూరికే చెప్పడు" అని సందానీకి మరింత బలం చేకూర్చాడు.

సాయంత్రం మున్నీ, సందానీ తల్లీ కుక్కలత్తమ్మ సుశీలతో గొడవ పడ్తున్నారు.

"నాదీ కోడీ వున్నాయి.. నాకీ గుడ్డుపెట్టినయ్.. నీకీ ఎందుకియ్యాల?" అని.

కుక్కలత్తమ్మ "నా గంపలో దూరి పెడితే మా కోడే పెట్టింది అనుకుని అట్టేసేసాను" అని లాజిక్ మాట్లాడింది.

మా అమ్మమ్మా, శ్యామలమ్మా, విభూది పండు, చేతికి రాసుకుని వత్తులు చేసుకుంటూ, గొప్ప వినోదంగా వింటున్నారు.

ఇంతలో సందానీ, జారిపోతున్న లాగుతో, చేతిలో తోటకూరకాడలతో వచ్చాడు. "ఇదిగో రంగనాథం సార్ ఇచ్చినయ్.. పులుసు వండు.. ఏమిటికి చారాణా గుడ్డుకోసం కొట్లాడ్తాయి? నేను నాలుగు మిద్దెల మేడ మీద నిలబడి కాసులు విసిర్తే ఈ సుశీలమ్మా, ఈమె కుక్కలూ, నోరుతెరుచుకుని చూస్తా ఏరుకుంటాయి... నేను పెద్దయినంక" అన్నాడు.


"అరె మేరే బచ్చా! కిత్ నా బడియా బోలారే" అని వాళ్ళమ్మ వాడికి ఆనందంతో మెటికలు విరిస్తే, "అల్లారఖా హుస్సేన్, సందానీ రహమాన్ సుల్తాన్ సాబ్! అనాల" అన్నాడు.

"తూ సుల్తాన్ హైరే! మాలూం హై" వాళ్ళమ్మ మురిసిపోయింది.

రంగనాథం సార్ అన్నట్లు, కొండదేవత నిజంగా వాడిని దీవించి, కొండ దేవరతో అలా పలికించి, మా సందానీ 'ఖూబ్ కమాయించి' ఎక్కడో నవాబులా వుండే వుంటాడని ఆసిస్తున్నాను.

మనిషికి భవిష్యత్తు గురించి వుత్సుకత అదీ చాలా బావుంది అని చెప్పాలని అడియాస! అందుకే యూ ట్యూబ్‌ల నిండా ఇంతమంది జ్యోతిష్య పండితులూ, పత్రికల నిండా వారఫలాలూ! అసలు ఆడపిల్లకి లైన్ వెయ్యడానికి కుర్రకారు 'చెయ్యి' చూస్తాం అనే మొదలు పెట్టారుట.

Post your comments










https://www.youtube.com/watch?v=ERaaX_IuIS4